క్లుప్తంగా

విద్యార్థులకు విద్యాభ్యాసన సామగ్రి పంపిణీ


విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దాత

పామూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రోత్సాహకంగా దాతలు విద్యాభ్యాసన సామగ్రి అందజేయడం అభినందనీయమని హెచ్ఎం కేతు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని నుచ్చుపొద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్‌యం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాపులేషన్ ఎన్యుమరేషన్ జిల్లా అధికారి దుద్దుకూరి రామసుబ్బారావు రూ.27 వేలతో సమకూర్చిన పలకలు, నోట్స్‌లు, పెన్నులు ఇతర విద్యాభ్యాసన సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. తూర్పుకట్ట కిందపల్లె ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కేవీ క్రిష్టారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెటీరియల్ వినియోగించుకోవాలి


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సూపర్‌వైజర్

మర్రిపూడి: అంగన్‌వాడీ విద్యార్థుల కోసం ప్రభుత్వం అందించే మెటీరియల్‌ను వినియోగించుకోవాలని సూపర్‌వైజర్ సుచరిత సూచించారు. మండలంలోని గుండ్లసముద్రం ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జనభాగీదారీ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల్లో శారీరక, మానసిక, గణిత భాషాభివృద్ధిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక మెటీరియల్ రూపొందించిందని పేర్కొన్నారు. అనంతరం ఐదేళ్లు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం

పీసీపల్లి: టీబీ రహిత సమాజమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులతో టీబీ ముక్త భారత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా టీబీ కేసులు ఉంటే గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజ్యలక్ష్మి, టీబీ ఎస్‌డీఎస్ బాబూరావు, ఈఓఅండ్‌పీఆర్‌డి మల్లేశ్వరి, వైద్యారోగ్య సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు

నవోదయకు ఎంపిక

పీసీపల్లి: మండలానికి చెందిన విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారు. స్థానిక సాయి వివేకా ఎడ్యుకేషన్ అకాడమీకి చెందిన మధుప్రియ, జశ్వంత్, నక్షత్రలు నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. పెదవరిమడుగుకు చెందిన కరణం మైథిలి ఇంటర్మీడియెట్ గురుకులం, ఏపీఆర్‌జేసీకి ఎంపికయ్యారు. టి.గణేష్, వరుణ్ సాయిలు ఎస్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. స్వర్ణ రేవంత్ సాయి సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. వీరిని ఎంఈఓలు దాసుప్రసాద్, ఆర్ ప్రసాద్‌లు అభినందించారు.

పొగాకు అత్యధిక ధర రూ.245

కందుకూరు: పొగాకు వేలంలో అత్యధిక ధరలు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన పొగాకు వేలంలో కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో కేజీ పొగాకు అత్యధిక ధర రూ.245 పలికింది. దీనిలో భాగంగా కందుకూరు-1లో 1123 బేళ్లు వేలానికి ఉంచగా 1053 బేళ్లు, కందుకూరు-2లో 804 బేళ్లను వేలానికి ఉంచగా 732 బేళ్లు అమ్ముడుపోయాయి. రెండు వేలం కేంద్రాల్లోను అత్యధిక ధర రూ.245 లభించగా, అత్యల్ప ధర రూ.260 వచ్చింది.

విద్యే భావితరాలకు మనమిచ్చే ఆస్తి

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్
- 117 మంది విద్యార్థులకు సాయి ప్రతిభా పురస్కారాలు అందచేత


పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే బుర్రా, ఇతర నేతలు

కనిగిరి రూరల్: విద్య ఒక్కటే భావితరాలకు మనమిచ్చే ఆస్తి అని, విద్యార్థులను ప్రోత్సహించేందుకు సాయిబాబా దేవస్థాన ట్రస్ట్ ప్రతిభా పురస్కారాలు అందించడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, మెమెంటోలను గురువారం అందచేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి, ట్రస్టు అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, శ్రీరామ్ మురళీ ల అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ పేద వర్గాల్లో విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. నాడు-నేడు పథకంతో ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామన్నారు. విద్యార్థులు చదువును ఏకాగ్రతతో, ఉన్నత లక్ష్యంతో అభ్యసించినప్పుడే సత్ఫలితాలు సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లతో విద్యను బోధిస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అందుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, గురువులకు, స్వగ్రామానికి మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి తన వంతు పూర్తి సాకారం అందిస్తానని చెప్పారు. డిప్యూటీ డీఈఓ కె.చంద్ర మౌళీశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పొంతన లేని ర్యాంకుల పేరుతో ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లి దండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. సీఐ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యతోనే మంచి భవిష్యత్ సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, గంగసాని హుసేన్ రెడ్డి, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, బీటీఏ జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసులు, ముచ్చర్ల ధర్మ, కౌన్సిలర్లు దేవకి రాజీవ్, ఖాశింసా, ఎంఈఓలు జే ప్రసాద్‌రావు, యు నారాయణరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, దేవిరెడ్డి రామిరెడ్డి, జంగమయ్య నాయుడు, రాజాల కొండారెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు, జానీ, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, టి.వెంకటరెడ్డి, వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు. ఆరు మండలాలకు చెందిన మొత్తం 117 మంది విద్యార్థులకు సాయి ప్రతిభా పురస్కారాలను అందచేసినట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

జగనన్న ఆణిముత్యాలకు అభినందన

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం అని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి, జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులను గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందచేశారు. ప్రధానోపాధ్యాయురాలు కాల్వ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏ తేజస్వినికి (ప్రథమ) రూ.3వేలు నగదు, ఎస్‌కే అర్షానా (ద్వితీయ) రూ.2వేలు, పి.నస్తీన్ రూ వెయ్యి (తృతీయ) బహుమతులు, అలాగే ఆర్‌బీఐ నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో విజేతలగా నిలిచిన ఎస్ బ్యూలా గ్రేస్, పి.సంజనా రాణిలు రూ. 5 వేలు బహుమతిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు.

జగనన్న విద్యా కానుక సకాలంలో అందించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు

హనుమంతునిపాడు: జగనన్న విద్యా కానుక కిట్లు ప్రతి విద్యార్థికి సకాలంలో అందించాలని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో నూతనంగా విధుల్లో చేరిన రెండో ఎంఇఓ పరిచయ కార్యక్రమం హెచ్ఎంలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాల్లో జగనన్న విద్యా కానుక కిట్లు అందించారా లేదాని అడిగి తెలుసుకున్నారు. కొరత లేకుండా ప్రతి విద్యార్థికి షందించాలన్నారు. ఆరో తరగతిలో నూతనంగా చేరే విద్యార్థుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. టీచర్ల బయోమెట్రిక్ హాజర్ సక్రమంగా ఉండాలన్నారు. ఈ ఏడాది కూడా పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధనకు కృ షి చేయాలన్నారు. జగనన్న గోరు ముద్ద పథకం ప్రతి పాఠశాలలో సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనుల నాణ్యత ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎంఈఓ జి.పెద్దిరాజు, రెండో ఎంఈఓ ఎస్. రమణయ్య, వెలిగండ్ల రెండో ఎంఈఓ దేవిరెడ్డి రామిరెడ్డి, పాఠశాలల హెచ్ఎంలు జీవి సురేష్ బాబు, డి. భాస్కరెడ్డి, రామోహన్, నారాయణరెడ్డి, కస్తూరి బా బాలికల పాఠశాల ఎస్ఓ ఇందిరా సుహాసిని, సీఆర్పీలు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

హనుమంతునిపాడు: భూముల రీ సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్.హరిబాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వేలో అన్ని రకాల రికార్డులు పరిశీలించి నిష్పక్షపాతంగా సర్వే చేయాలన్నారు. స్పందనలో వచ్చిన రైతుల అర్జీలు పరిశీలించి పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. మ్యుటేషన్లు, ఆన్‌లైన్, నివాసం, కుల ధృవీకరణ, ఫ్యామిలీ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా చేయాలని సూచించారు. వీఆర్వోలు ప్రజలకు సచివాలయ పరిధిలో అందుబాటులో ఉంటూ పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రమణయ్య, వీఆర్వోలు వెంకటస్వామి, శ్రీనివాసులరెడ్డి, కాశీం, ఫీరా, బాదుర్ల, పురుషోత్తం పాల్గొన్నారు.

మహిళలు స్వయం సంవృద్ధి సాధించాలి


శిక్షణ ధృవీకరణ పత్రాలు పంపిణీచేస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

పామూరు: టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలు సద్వినియోగం చేసుకుని స్వయం సంవృద్ధి సాధించాలని రిలయన్స్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ నవీన్ అన్నారు. మండలంలోని దూబగుంట్లలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పొదులు సంఘాల ద్వారా రుణాలు తీసుకుని కుట్టుమిషన్లను కొనుగోలు చేసి ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో సార్డ్ టీఎల్ రాజేశ్వరరావు, జేఎస్ఎస్ నుమ్బి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఆదాంబీ, మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలలు పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఎంఈఓలు

ఉలవపాడు: మండల పరిధిలోని పాఠశాలలను ప్రధానోపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ చెంచమ్మ, ఎంఈఓలు ప్రసాద్, రమణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలలో నూతనంగా విద్యార్థులు చేరుతున్నారు కాబట్టి వారిని వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. హాజరు తొలి అరగంటలో పూర్తిచేయాలని తెలిపారు. అమ్మఒడికి సంబంధించి జాబితాను పరిశీలించి అర్హులందరికీ పథకం వర్తించేలా చేయాలన్నారు. నాడు-నేడు ద్వారా పనులు జరుగుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పనులు త్వరిత గతిన జరిగేలా చూడాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యాకానుక కిట్ అందచేయాలన్నారు. నూతనంగా బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న ఎంఈఓ

గుడ్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈఓ ప్రసాదరావు అన్నారు. మండలంలోని అమ్మవారిపాలెం, అడవిరాజుపాలెం గ్రామాల్లోని రెండు ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం ఎంఈఓ తనిఖీ చేశారు. రెండు పాఠశాలల్లో రికార్డులను, రిజిష్టర్లను అడవిరాజుపాలెంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిచారు. ఈ సందర్భ,గా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో నాడు-నేడు పథకం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన భోజనం, రాగిజావ అందిస్తున్నందున, విద్యార్థులంతా పాఠశాలల్లోనే భోజనం చేసేలా చూడాలన్నారు. అనంతరం అమ్మవారిపాలెం యూపీ పాఠశాలలో పాఠశాల ఉపాధ్యాయుడు క్రిష్టారెడ్డి అందజేసిన రూ.10 వేల విలువైన పాఠ్య సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. అనంతరం నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే మండల విద్యాశాఖ అధికారి-2 గోవర్ధన్ పోట్లూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో రికార్డులను, రిజిష్టర్‌లను, వంటగది నిర్మాణ పనులను పరిశీలించారు. హెచ్ఎంలు విజయ్‌కుమార్, మాల్యాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యానశాఖాధికారిగా కుసుమ బాధ్యతల స్వీకరణ


కొప్పనాటి కుసుమ

పామూరు: మండల ఉద్యానవన శాఖాధికారిగా కొప్పనాటి కుసుమ నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన ఏపీపీఎస్సీద్వారా ఆమె ఉద్యానవనశాఖాధికారిగా నియమితులయ్యారు. పామూరుతోపాటు పీసీపల్లి, సీఎస్‌పురం మండలాల అధికారిగా కూడా ఆమె బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు మార్కాపురం హెచ్ఓ పామూరు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఉద్యానవనశాఖద్వారా మూడు మండలాల్లో రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఇద్దరు ఎంఈఓలకు సన్మానం


ఎంఈఓలను సన్మానిస్తున్న బీటీఏ నేతలు

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండల ఎంఈఓలుగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్, ఏ మల్లికార్జున్‌ను బహుజన టీచర్స్ అసోసియేషన్(బిటిఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లగుంట మోహన్‌రావు అధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో గురువారం సన్మానించారు. నూతన ఎంఈఓ మల్లిఖార్జున్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. బీటీఏ రాష్ట్ర కార్యదర్శి సంగా మహేంద్ర, కౌన్సిలర్ మెండ వెంకట్రావు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కుట్ర


నిరసనలో మాట్లాడుతున్న జాలా అంజయ్య

పామూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు జాలా అంజయ్య అన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికసంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు ఉపాధి హామీ పథకం వరం లాంటిదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం నిధుల కోతతో నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి 200 పనిదినాలు కల్పించాలన్నారు. అనంతరం ఏపీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కె.మాల్యాద్రి, వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి వై.వీరనారాయణ, కూలీలు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక


బాస్కెట్‌బాల్‌కు ఎంపికైన జట్టు

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టులో జిల్లా బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక గురువారం నిర్వహించారు. ఎంపికలో జిల్లా నుంచి సుమారు 30 మంది బాలురు, 15 మంది బాలికలు పాల్గొన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 29 నుంచి జూలై 2 వరకు నూజివీడులో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ కంచర్ల రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ఎస్ సురేష్, జనరల్ సెక్రటరీ టి.సుబ్బారావు, పీడీలు పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రవీంద్ర, రాజు, చిట్టెమ్మ పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

కందుకూరు: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి అర్థ సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి పన్నుపై ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇచ్చిందని కమిషనర్ మనోహర్ తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించే ఆస్తి పన్ను బకాయిలను వడ్డీ లేకుండా కట్టించుకుంటామన్నారు. జూలై ఒకటి నుంచి చెల్లించే ఆస్తి పన్ను బకాయిలపై నూటికి రెండు రూపాయల చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ ఆస్తి పన్ను బకాయిలను ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నీటి పన్ను బకాయిలు ఉన్న వారు కూడా వెంటనే మున్సిపాలిటీకి చెల్లించాలని, నీటి పన్ను చెల్లించని కుళాయిలను తొలగిస్తామని హెచ్చరించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఆఫ్‌లైన్ విధానంలో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు రాత పరీక్ష ద్వారా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌కే హస్తార్ ఒక ప్రకటనలో గురువారం తెలియజేశారు. ప్రవేశం పొందే విద్యార్థులు ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలని కోరారు.

అన్ని గ్రేడ్ల పొగాకుకు సరైన ధర ఇవ్వాలి

- టుబాకో బోర్డు ఒంగోలు రీజియన్ ఆర్ఎం లక్ష్మణరావు


వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు

టంగుటూరు: రైతులు వేలానికి ఉంచిన అన్ని గ్రేడ్ల పొగాకుకు సరైన ధర అందించాలని బోర్డు రీజియన్ రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఫ్లోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. 2023- 24 పంట కాలానికి ఆథరైజ్డ్ క్వాంటిటీ ఇవ్వడానికి అన్ని గ్రామాల సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమావేశంలో రైతు నాయకులు పాల్గొన్నారు.

గరిష్ట ధర రూ.245

స్థానిక వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల రైతులు 849 బేళ్లను తీసుకురాగా 826 కొనుగోలయ్యాయి. 23 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.245, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.240.84 పలికింది. వేలంలో మొత్తం 33 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న రావుల వెంకయ్య

కందుకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని సీపీఐ జాతీయ నాయకుడు రావుల వెంకయ్య అన్నారు. స్థానిక కోటారెడ్డి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, పోలవరం ప్రాజెక్టు పూర్తి డిజైన్ ప్రకారం నిర్మాణం జరగాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మాలకొండయ్య, నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ బాబు, ఏఐటీయూసీ కార్యదర్శి వై ఆనందమోహన్, ఏఐవైఎఫ్ కార్యదర్శి చంద్రమోహన్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష షెడ్యూల్ విడుదల

గిద్దలూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని అధికార యంత్రాంగం షెడ్యూల్‌ను స్థానిక ఎంపీడీఓ హేమలత గురువారం విడుదల చేశారు. జూలై 1వ తేదీన గడికోట, అంబవరం, 3వ తేదీన కంచిపల్లె, కొమ్మునూరు, 5వ తేదీన ముండ్లపాడు, 7న కెఎస్‌పల్లె, 10న నరవ, కొత్తకోట, 12 పాదలకుంటపల్లె, ఓబులాపురం, 14న తంబళ్లపల్లె, సంజీవ రాయుడుపేట, 17న ఉయ్యాలవాడ, తిమ్మాపురం, 19న వెల్లుపల్లె గ్రామాల్లో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.

దర్శి: ఈ నెల 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి అధికారులందరూ హాజరు కావాలని ఎంపీడీఓ కుసుమకుమారి కోరారు. దర్శి-1, దర్శి-2 అనే రెండు టీమ్‌లుగా ఏర్పడి రోజూ మండలంలో రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒకటో తేదీ వెంకటాచలం పల్లి, శామంతపూడి, 3వ తేదీ రాజంపల్లి, రామచంద్రాపురం, 5వ తేదీ పాతకమూరు, పోతవరం, 7వ తేదీ లంకోజనపల్లి, పెద్ద ఉయ్యాలవాడ, 10వ తేదీ కొత్తపల్లి, కొర్లమడుగు, 12వ తేదీ తూర్పువెంకటాపురం, తూర్పు వీరాయపాలెం, 14వ తేదీ తూర్పు చౌటపాలెం, దేవవరం, 17వ తేదీ బొట్లపాలెం, చందలూరు, 19వ తేదీ బండివెలిగండ్ల, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పసుపుగల్లు వీఏఏ సస్పెన్షన్

ముండ్లమూరు: మండలంలోని పుపుగల్లు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకురాలిగా పని చేస్తున్న రమావత్ స్వాతిబాయిని సస్పెండ్ చేస్తూ డీఏఓ శ్రీనివాసరావు నుంచి పోస్టల్ ద్వారా ఉత్తర్వులు అందాయని మండల వ్యవసాయాధికారి ఫారుక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.